మరిన్ని రూట్లకు బస్సు సౌకర్యం


చంద్రకాంత్‌, కుషాయిగూడ డిపో మేనేజర్‌

కాప్రా: కుషాయిగూడ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించేందుకు నూతన రూట్లలో బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్‌ చంద్రకాంత్‌ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌ బస్‌ టెర్మినల్‌ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి ఈ బస్సు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ బస్సు ఈసీఐఎల్‌ బస్‌ టెర్మినల్‌ నుంచి సాయినాథ్‌పురం, భరత్‌నగర్‌, ఆర్టీసీ కాలనీ, ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌, ఉత్తమ్‌నగర్‌, జ్యోతినగర్‌, తుకారాంగేట్‌ మీదుగా సికింద్రాబాద్‌ బస్టాప్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈసీఐఎల్‌ నుంచి అటు సికింద్రాబాద్‌ నుంచి మొదటి బస్సు ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు ప్రారంభం అవుతుందని ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని చెప్పారు. చివరి బస్సు కూడా ప్రతిరోజు రాత్రి 8.50 గంటలకు అటు ఈసీఐఎల్‌, ఇటు సికింద్రాబాద్‌ నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్‌ వివరించారు.

కోదండరాం పరామర్శ


ఎమ్మెల్యే సత్యంను ఓదారుస్తున్న కోదండరాం

అల్వాల్‌: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మంగళవారం తెలంగాణ జన సమితి అధినేత ప్రొఫెసర్‌ కోదండరాం పరామర్శించారు. ఎమ్మెల్యే సత్యం భార్య ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అల్వాల్‌ పంచశీల కాలనీలోని ఎమ్మెల్యే నివాసానికి కోదండరాం వెళ్లి ఓదార్చారు. సురేందర్‌రెడ్డి, దయాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

గద్ద నరింగ్‌రావుకు నివాళి

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌ ఎర్రకుంటకు చెందిన గద్ద నర్సింగ్‌రావు మృతిపై ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతాప వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గ్రేటర్‌ బీఆర్‌ఎస్‌ నేత సాయిజెనోఖర్‌ తదితరులున్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కనుల పండువగా శ్రీవారి కల్యాణం


ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చక్రిపురంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమాలు, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఆరగింపు, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం రాత్రి విష్ణుసహస్ర పారాయణం చేశారు. ఆలయ చైర్మన్‌ మొలుగు ప్రతాప్‌రెడ్డి, డాక్టర్‌ చక్రధర్‌రెడ్డి, రణధీర్‌రెడ్డితో పాటు స్థానిక నేతలు రాఘవరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌, గోపాల్‌యాదవ్‌ తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై పాదయాత్ర..

కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి న్యూ విరాట్‌నగర్‌లో పాదయాత్ర చేసి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాల మరమ్మతులు, మ్యాన్‌హోల్స్‌ తదితర సమస్యలను గుర్తించామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


గణేష్‌ (ఫైల్‌)

ఉప్పల్‌: అప్పుల బాధతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌ భరత్‌నగర్‌ ప్రాంతానికి చెందిన గణేష్‌ (24) అప్పుల బాధ తట్టుకోలేక ఈనెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య తులసి మంగళవారం ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాచారం ఇన్‌స్పెక్టర్‌గా రుద్వీర్‌కుమార్‌


రుద్వీర్‌కుమార్‌

మల్లాపూర్‌: నాచారం పోలీస్‌ స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా రుద్వీర్‌కుమార్‌ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఎల్బీనగర్‌ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. నాచారం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన నందీశ్వర్‌రెడ్డిని రాచకొండ సీపీ కార్యాలయానికి అటాచ్‌ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్‌: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌ కళ్యాణపురి ప్రాంతానికి చెందిన సారిల్లా భానుమూర్తి కుమారుడు సారిల్లా అర్జున్‌రావు (33) ప్రైవేట్‌ ఉద్యోగి.

ఇతనికి భార్య ఇద్దరు సంతానం. కాగా గత కొంతకాలంగా ఆన్‌లైన్‌ క్రికెట్‌ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోయాడు. భార్య సుధారాణి అనారోగ్యంతో పుట్టింటి వద్ద ఉంటుంది. 24న తండ్రికి బయటకు వెళ్తున్నానని చెప్పి ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ చేశాడు. కుమారుడి ఆచూకీ కోసం తండ్రి వెతికినా ఫలితం లేకపోవడంతో అనుమానం వచ్చి బెడ్రూమ్‌ తలుపులు విరగొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. దీంతో అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


మిర్జాల్‌గూడలో ఇళ్ల ముందున్న మురుగును తొలగిస్తున్న సిబ్బంది

వర్షం పడితే జాగారమే !

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని పలు కాలనీల్లో వర్షం వచ్చిందంటే పలు కాలనీల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. డివిజన్‌ పరిధిలోని మిర్జాల్‌గూడ, జ్యోతినగర్‌, రాజానగర్‌, రాజాశ్రీనివాసనగర్‌, పవన్‌ మోటర్స్‌, వెంకటాద్రినగర్‌ తదితర ప్రాంతాల్లో వర్షం వచ్చిన ప్రతిసారి ముంపు సమస్య తీవ్రంగా ఉంటుందని తెలిపారు. వరద నీటితో పాటు మురుగు ఇళ్లలోకి వచ్చి చేరుతుందని దానివల్ల మంజీర నీరు, బోరునీరు ఉన్న సంపులు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌ సిబ్బంది స్పందించకపోవడంతో దుర్వాసన, దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, స్థానికులు తెలిపారు.

50 ఏళ్లుగా పరిష్కారం కావడం లేదు..

గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని మిర్జాల్‌గూడ, చిన్మాయిమార్గ్‌, వెంకటాద్రినగర్‌, రాజానగర్‌, రాజాశ్రీనివాసనగర్‌, పవన్‌ మోటర్స్‌ తదితర ప్రాంతాల్లో సుమారు 50 ఏళ్ల నుంచి వర్షం వచ్చిన ప్రతిసారి ముంపు సమస్య తీవ్రంగా ఉంటుంది. వర్షం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వరద నీటి ప్రవాహం తీవ్రంగా ఉన్నప్పుడు ఇంటి ముందు ఉన్న వాహనాలు సైతం కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి. ముఖ్యంగా మహేంద్రహిల్స్‌, అన్నపూర్ణ సొసైటీ, జేఎల్‌ఎన్‌ఎస్‌నగర్‌, గోపాల్‌నగర్‌, జ్యోతినగర్‌ ప్రాంతాలతో పాటు లాలాగూడ, తుకారంగేట్‌ ప్రాంతాల నుంచి వరద నీరు వెళ్లేందుకు ఈ కాలనీలే ప్రధానం కావడంతో తరుచూ వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటుంది.

ఏళ్లు గడిచినా పైపులైన్‌ వేయలే !

షాపుల ముందే పైపులు ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు

మౌలాలి: మౌలాలి మారుతీనగర్‌ ఫ్లోరో హోటల్‌ నుంచి ఏఎస్‌రావునగర్‌కు వెళ్లే రహదారి 1000 ఎంఎం డ్రైయిన్‌ పైప్‌లైన్‌ పనులకు రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. దీంతో పనులు ప్రారంభమవుతాయని భావించినా.. ఇప్పటి వరకు పనులు పూర్తికాకపోవడంతో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

వ్యాపారాలకు అడ్డుగా...

మారుతీనగర్‌ నుంచి ఏఎస్‌రావునగర్‌ వెళ్లే రోడ్డుపై అడ్డుగా పైపులు ఉండటంతో వ్యాపార సముదాయాల నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాహనాలను పార్కింగ్‌ కోసం ఇబ్బంది కలుగుతుందని వాపోతున్నారు.

పనులు పూర్తి చేయడంలో విఫలం..

మారుతీనగర్‌లో పైపులైన్‌ పనులు పూర్తి చేయడంలో అధికారులు, పజా ప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు.


మౌలాలి మారుతీనగర్‌ రోడ్డు పక్కన ఇలా..


అడ్డుగా ఉండటంతో గిరాకీ లేదు..

షాపు ముందు పైపు ఉండటంతో గత రెండేళ్లుగా వ్యాపారం మొత్తం దెబ్బతింది. షాపుకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్‌ చేయడానికి స్థలం లేక రాలేకపోతున్నారు. వ్యాపారాలు నడవకపోవడంతో పిల్లల స్కూల్‌ ఫీజులు కట్టలేక పోతున్నాం. షాపుల ముందున్న పైపులను వెంటనే తొలగించాలి.

\- రాధిక, మారుతీనగర్‌

పైపులతో ప్రమాదాలు..


డ్రైయిన్‌ పైప్‌లను తెచ్చి వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులకు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ఎదురుగా వచ్చిన వాహనాలు సరిగ్గా కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి.

\- గణేష్‌, స్థానికుడు


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌ఓసీ మంజూరు..

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌కు చెందిన పద్మావతి చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రూ.1,50,000 విలువజేసే ఎల్‌ఓసీ మంజూరు కావడంతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆ పత్రాలను పద్మావతికి అందజేశారు.

సదుపాయాల కల్పనకు కృషి

ఉప్పల్‌: డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చిలుకానగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ బన్నాల గీత ప్రవీణ ముదిరాజ్‌ తెలిపారు. మంగళవారం బీరప్పగడ్డ రాఘవేంద్రనగర్‌, సాయిరాంనగర్‌, చిలుకానగర్‌ తదితర ప్రాంతాల్లో ప్రజల అభ్యర్థన మేరకు వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. కార్పొరేటర్‌ స్వయంగా పనులను పరిశీలించారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్‌, జగన్‌, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వినికిడి పరీక్షలు

అల్వాల్‌: హెలెన్‌ కెల్లెర్‌ జయంతి సందర్భంగా నేరేడ్‌మెట్‌ రామకృష్ణపురంలోని హెలెన్‌ కెల్లర్స్‌ స్పీచ్‌, హియరింగ్‌ క్లినిక్‌లో నేడు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. జూన్‌ 26 నుంచి 29 వరకు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ పరీక్షలు ఉంటాయన్నారు. వినికిడి లోపం ఉన్న పెద్దలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌ !

కుషాయిగూడ: ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోల్స్‌ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. కుషాయిగూడ, శ్రీ సాయికృష్ణ ఎన్‌క్లేవ్‌ సమీపంలో ఓ మ్యాన్‌హోల్‌ ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోల్‌ కుంగిపోయిందని కాలనీ అధ్యక్షుడు కుమారస్వామి తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో కుంగిపోయిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

- దశాబ్దకాలంగా పరిష్కారం కాని వరద ముంపు సమస్య
- శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజల వినతి

వర్షం వచ్చిన ప్రతిసారి నరకం చూస్తున్నాం..


గత ఏడేళ్లుగా వర్షం వచ్చిన ప్రతిసారి నరకం అనుభవిస్తున్నాం. మా ఇంటి ముందు వరద నీరు, మురుగునీరు నిలిచి చెరువును తలపిస్తున్నాయి. ఇళ్లలోకి వరద చేరడంతో తాగునీటితో పాటు బోరు నీరు కూడా కలుషితం అవుతోంది.

\- రంగారాణి, మిర్జాల్‌గూడ

రోడ్డు ఆక్రమణలవల్లే.....


వర్షం వచ్చిన ప్రతిసారి మిర్జాల్‌గూడ చుట్టు పక్కల ప్రాంతాలలో జలమయం అవ్వగానికి ప్రదాన కారణం రోడ్డు అక్రమణలే కారణమని కాలనీ వాసులు తెలిపారు. రోడ్డు అక్రమణలను తొలగించి రోడ్లను వెడల్పు చేసి డ్రైనేజీ నిర్మాణాలు చేపడితే సమస్య పరిష్కారం అందుతుంది.

\- జంగాల శ్రీరామ్‌, మిర్జాల్‌గూడ

ట్రాన్స్‌ఫార్మర్లను పట్టించుకోండి !

ఓ చోట చెట్ల తీగలు, మరోచోట నాలా పనులకు ఆటంకం

మల్కాజిగిరి: మరమ్మతుల పేరిట విద్యుత్‌ విభాగం అధికారులు చెట్ల కొమ్మలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మొక్కలను తొలగిస్తుంటారు. మల్కాజిగిరి డివిజన్‌ మారుతీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌, విద్యుత్‌ తీగలకు మొక్కల తీగలు అల్లుకుపోయినా.. పట్టించుకోకపోవడం గమనార్హం.

విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి..

అల్వాల్‌: వినాయక్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని కాకతీయనగర్‌లో నాలా నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకి తరలించాలని స్థానికుడు గుండ నరసింహారాజు విద్యుత్‌ అధికారులను కోరారు. కాగా రానున్న వర్షాకాలం కావడంతో గల్లీలో వరద ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దాదాపు 2 నుంచి 3 అడుగుల మేర వరద వస్తుందన్నారు. ఎర్తింగ్‌ వైర్లు నీళ్లల్లో ఉండటంతో విద్యుత్‌షాక్‌ వస్తుందేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారన్నారు. గతంలోనే ఈ సమస్యపై ఈస్ట్‌ కాకతీయనగర్‌ కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. నాలా నిర్మాణ పనులు జరుగుతున్నందున వీలైనంత త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని ఆయన సంబంధిత విద్యుత్‌ శాఖ అధికారులను కోరారు.


చెట్ల తీగలతో.. ఈస్ట్‌ కాకతీయనగర్‌లో నాలా నిర్మాణ పనులకు అడ్డంకిగా..

కోడిపందేల స్థావరంపై దాడులు

మేడిపల్లి: కోడిపందేల స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పలువురుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మంగళవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ సత్యనారాయణపురం కాలనీలో కోడి పందేలను నిర్వహిస్తున్నారని సమాచారంతో ఎస్‌ఓటీ, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా స్థావరంపై దాడిచేసి 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 3 ఫైటింగ్‌ కుక్స్‌, 22 కోడి కత్తులు, రూ.39,600 నగదును స్వాధీనం చేసుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఉత్తమ సేవా పతకం ప్రదానం

మేడిపల్లి: రాచకొండ కమిషనరేట్‌ పరిధిలోని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్‌ గోవింద్‌రెడ్డి రాచకొండ సీపీ తరుణ్‌ జోషి చేతుల మీదుగా మంగళవారం ఉత్తమ సేవా పతకాన్ని అందుకున్నారు. విశిష్ట సేవలు అందించిన పోలీస్‌ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాలను ప్రకటించింది.


సేవా పతకాన్ని అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్‌ గోవర్ధన్‌రెడ్డి

‘ఆర్‌యూబీ’ని నిర్మించండి

గౌతంనగర్‌: దశాబ్దకాలంగా గౌతంనగర్‌ లెవెల్‌ క్రాసింగ్‌ (రైల్వేగేటు) వద్ద ఆర్‌యూబీని నిర్మించాలని మల్కాజిగిరికి చెందిన ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి నూర్‌ తెలిపారు. తరుచూ గేటు పడుతుండటంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు మారుతున్న గౌతంనగర్‌లో రైల్వే ఆర్‌యూబీ నిర్మాణానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యకం చేశారు. వాహనదారులు, ప్రజలతో పాటు నివాసితులకు కూడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రైల్వే స్థలంలోనే ఆర్‌యూబీని నిర్మించాలని ఆయన కోరారు.

వేర్వేరు ఘటనల్లో గంజాయి విక్రేతల అరెస్ట్‌


భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం

ఉప్పల్‌: గంజాయి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర మూఠా సభ్యుడిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఉప్పల్‌ ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ ఓంకార్‌ తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశా నుంచి తీసుకొచ్చి మల్లాపూర్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఉప్పల్‌ ఎక్సైజ్‌ పోలీసులు సిబ్బందితో మంగళవారం మల్లాపూర్‌ మాణిక్‌చంద్‌ కంపెనీ చౌరస్తా వద్ద మాటు వేశారు. ఇంతలోనే బెల్‌ కంపెనీ సర్కిల్‌ వద్దకు ఓ వ్యక్తి బ్యాగ్‌తో రావడాన్ని గమనించిన పోలీసులు అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. దాదాపుగా రెండు కిలోల గంజాయి బయటపడింది. నిందితుడిని విచారించగా..ఒడిశాకు చెందిన కమంతం జాన్‌ (26), మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద నివాసం ఉంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

మేడిపల్లి: ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్‌, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని అందించాలని మేడిపల్లి సీఐ గోవింద్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మేడిపల్లి పోలీసులు బోడుప్పల్‌ ఏరియాలో వాహన తనిఖీలు నిర్వ హిస్తుండగా.. అనుమానాస్పదంగా రెండు ద్విచక్ర వాహనాల మీద తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా.. దాదాపు కిలోకు పైన గంజాయిని గుర్తించారు. శేషసాయినగర్‌ బోడుప్పల్‌కు చెందిన కుర్మెళ్ల సా యికుమార్‌ (25), శివరాత్రి వినయ్‌కుమార్‌ (22) ఒడిశాకు చెందిన కొడిదల మనోజ్‌ (24) సంతోష్‌ కుమార్‌ (27) నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి దాదాపుగా 1100 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

\- బోడుప్పల్‌ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పరిశీలించగా.. సదరు వ్యక్తి వద్ద దాదాపు 1300 గ్రాముల గంజాయి బయటపడింది. అతడిని విచారించగా.. సీతాఫల్‌ మండి సికింద్రాబాద్‌కు చెందిన జున్ను సంతోష్‌ కుమార్‌ (28) వృత్తి కూలీ. కాగా నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎక్సైజ్‌పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ నవీన్‌కుమార్‌, సీఐ చంద్రశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి బస్‌స్టాప్‌ వద్ద బస్సులోనుంచి దిగిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన 12.33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.


నిందితుడితో ఎక్సైజ్‌ పోలీసులు

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన స్థానిక నేతలు



బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ బీఆర్‌ఎస్‌ నేతలు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో కలిశారు. బోడుప్పల్‌లో నెలకొన్న రాజకీయ పరిణామాలపై ఆయనతో చర్చించారు. బోడుప్పల్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్‌, కాటపల్లి రాంచంద్రారెడ్డి, కొత్త చక్రపాణిగౌడ్‌, బందారం శ్రీధర్‌గౌడ్‌, నర్సింహ్మారెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందచేస్తున్న ఎమ్మెల్యే

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాలలో కాలేరు యమునాబాయి ట్రస్ట్‌, కాలేరు జైనవీన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యమునబాయి ట్రస్ట్‌ సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, బీఆర్‌ఎస్‌ నాయకులు పసూల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, కాలేరు సుధాకర్‌, అజిత్‌రెడ్డి, సూరం శంకర్‌, చాంద్‌పాషా, పవన్‌, అద్విత్‌, శ్యామ్‌, నాని, చందు, లక్ష్మణ్‌రావు, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

మల్కాజిగిరి: ఈపీఎఫ్‌ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి త్వరలో జరిగే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని టాప్రా (తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోషియేషన్‌) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజిగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలిండియా కమిటీ మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యాచరణలో భాగంగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు జంతర్‌ మంతర్‌ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనడంతో పాటు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరుతూ పార్లమెంట్‌ సభ్యులకు ఆయా జిల్లాల బాధ్యులు వినతిపత్రాలు అందజేస్తారన్నారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పెన్షనర్లు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు బాల గంగాధర్‌, అశోక్‌, విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పూడిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో పనులు వేగవంతం చేస్తామని కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు. బలరాంనగర్‌లో సుమారు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కృపా కాంప్లెక్స్‌ ప్రాంతంలోని ఎస్టీపీ ప్లాంట్‌ పరిసరాల్లో నాలా పూడికతీత పనులను పరిశీలించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఎన్నికలు, ఇతర కారణాలతో పనుల్లో జాప్యం జరిగిందని, ఇప్పటికైనా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. డీఈ మహేష్‌, ఏఈ దీపక్‌, వీఐ.రమేష్‌, ఎంటమాలజీ అధికారి దుర్గాప్రసాద్‌ తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో డబుల్‌ బెడ్రూం లబ్ధిదారులు

అల్వాల్‌: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో డబుల్‌ బెడ్రూం లబ్ధిదారులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌ ప్రభుత్వంలో తమకు డబుల్‌ బెడ్రూంలు కేటాయించారని, వాటికి డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్‌ పనులు నిలిపేశారన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను చేపట్టాలని సూచించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్‌ సీఐ శివశంకర్‌

మౌలాలి: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మల్కాజిగిరి ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ శివశంకర్‌ అన్నారు. మంగళవారం షేర్‌ అబ్రారీల్లా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఓల్డ్‌ సఫిల్‌గూడలోని కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌లో మొక్కలు, ప్లాస్టిక్‌ వాడకం నిషేదంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్‌ శివశంకర్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకూడదని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు విజయ అర్చన, ఎన్విరాన్‌మెంట్‌ బోర్డు మెంబర్‌ జగన్‌, పాఠశాల డైరెక్టర్‌ చంద్రమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్‌ జాన్‌ సురేష్‌బాబు పాల్గొన్నారు.